సాక్షి కామారెడ్డి
శుక్రవారం । 30 । ఆగస్టు । 2024



క్లినిక్‌లలో తనిఖీలు

నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న ఆర్‌ఎంపీ, పీఎంపీ క్లినిక్‌లలో అధికారులు గురువారం తనిఖీలు చేశారు.

- 9లో ▸



తెలుగు భాషా దినోత్సవం

జిల్లాలోని పలు పాఠశాలలు, కళాశాలల్లో తెలుగు భాషా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
32.1 /21.8

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. అక్కడక్కడ ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

రేపు జాబ్‌మేళా

కామారెడ్డి క్రైం : నిరుద్యోగ యువతకు ప్రైవేటు రంగంలో ఉద్యోగాలు కల్పించడానికి కలెక్టరేట్‌లోని జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో శనివారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఉపాధి కల్పనాధికారి మధుసూదన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. కామారెడ్డిలోని ప్రముఖ అన్నపూర్ణ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో పలు ఉద్యోగాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఇంటర్, డిగ్రీ, ఆపై చదివిన వారు అర్హులన్నారు. వేతనం రూ.16 నుంచి రూ.30 వేల వరకు ఉంటుందన్నారు. 18 ఏళ్ల నుంచి 32 ఏళ్లు కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ బయోడేటా, సర్టిఫికేట్‌లతో శనివారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటలలోపు హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 76719 74009, 93937 33356 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

నిజాంసాగర్ నీటి విడుదల



నిజాంసాగర్ : నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు నీటి విడుదలను గురువారం ప్రారంభించారు. వెయ్యి క్యూసెక్కుల నీటిని ఆయకట్టు పంటల కోసం వదులుతున్నారు. ఆయకట్టు కింద అలీసాగర్ రిజర్వాయర్ వరకు 1.15 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారు. వారం రోజుల నుంచి వర్షాలు లేకపోవడంతో పంటలు ఎండుముఖం పడుతున్నాయి. దీంతో నీటి పారుదల శాఖ అధికారులు రెండో విడత నీటి విడుదల చేపట్టారు. మొదటి విడతలో జూన్ నెలలో ఆయకట్టుకు 1.2 టీఎంసీల నీటిని విడుదల చేశారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 1405 అడుగులు(17.8 టీఎంసీలు) గాను ప్రస్తుతం 1391.80 అడుగులు(4.875 టీఎంసీల) నీరు నిల్వ ఉంది.

నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నాం

కామారెడ్డి అర్బన్ : జిల్లాలో వినియోగదారులకు అత్యుత్తమ సాంకేతికతతో నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నామని ఎన్పీడీసీఎల్ జిల్లా ఎస్ఈ ఎం రమేశ్‌బాబు తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన చేశారు. విద్యుత్ సరఫరాలో ఆధునిక సాంకేతికత వినియోగిస్తుండటంతో సరఫరాలో అంతరాయం తగ్గిందన్నారు. 33కేవీ, 11 కేవీ ఇంటర్ లింకింగ్ పనులు వేగవంతం చేస్తున్నామని పేర్కొన్నారు. అసెట్ మ్యాపింగ్ ట్రాకింగ్‌లో పోల్‌నంబర్ ద్వారా లోకేషన్ మ్యాపింగ్ తెలుసుకుని సమస్యలను వెంటనే పరిష్కరిస్తున్నట్లు తెలిపారు.

నేడు బాన్సువాడ సబ్ కలెక్టర్ బాధ్యతల స్వీకరణ

బాన్సువాడ : బాన్సువాడ సబ్ కలెక్టర్‌గా కిరణ్మయి శుక్రవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. బాన్సువాడ ఆర్డీవోగా పనిచేసిన రమేశ్ రాథోడ్ హైదరాబాద్‌కు వెళ్లనున్నారు. బాధ్యతల స్వీకరణకు రెవెన్యూ అధికారులు ఏర్పాట్లు చేశారు.

ప్రభుత్వ కాలేజీలో చేరండి



నిజాంసాగర్(జుక్కల్) : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు చేరాలని కోరుతూ ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాం, ప్రిన్సిపాల్ అసద్ ఫారూక్ ఒడ్డేపల్లి గ్రామంలో గురువారం అవగాహన కల్పించారు. గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ విద్యార్థులను కళాశాలలో చేర్చుకున్నారు. ఇప్పటి వరకు 25 మంది విద్యార్థులు కళాశాలలో అడ్మిషన్లు పొందినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. సిబ్బంది రమేష్, సాయిరాం, శివ తదితరులు ఉన్నారు.

డెంగీతో ఒకరి మృతి



లింగంపేట : లింగంపేట మండలం మెంగారం గ్రామానికి చెందిన అన్నం రాజు(42) డెంగీతో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వివరాలు.. రాజుకు మూడు రోజుల క్రితం జ్వరం రావడంతో కుటుంబ సభ్యులు కామారెడ్డిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. రక్తకణాలు తగ్గాయని, పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు హైదరాబాద్ తరలించాలని సూచించారు. దీంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య సక్కుబాయి, ఇద్దరు కూతుర్లు, ఒక కుమారుడు ఉన్నారు.

చదువులకు ఫీవర్!

జిల్లాలో జ్వరాలు విజృంభిస్తున్నాయి. సీజనల్ వ్యాధుల దాటికి చిన్నాపెద్ద తేడా లేకుండా మంచం పడుతున్నారు. డెంగీ, చికున్ గున్యా, టైఫాయిడ్, మలేరియా సోకుతుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా బడీడు పిల్లలపై జ్వరాల ప్రభావం ఎక్కువగా ఉంటోంది. దీంతో పాఠశాలల్లో హాజరు శాతం పడిపోతోంది. రోగాల భయంతో తల్లిదండ్రులు తమ పిల్లలను బడికి పంపడానికి భయపడుతున్నారు. దీంతో ఈ నెలలో ఇప్పటి వరకు చాలా బడుల్లో సగటున 50 శాతం మించి హాజరు నమోదు కాలేదు.

- స్కూళ్లలో తగ్గిన విద్యార్థుల హాజరు
- జ్వరాలతో సగం మంది ఇళ్లకే పరిమితం
- జిల్లా అంతటా ఇదే పరిస్థితి



సదాశివనగర్ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు



■ మాచారెడ్డి మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 1,897 మంది విద్యార్థులు చదువుతుండగా ఈ నెల మొదటి వారంలో 468 మంది (25 శాతం) మాత్రమే బడికి హాజరయ్యారు. జ్వరాలతో విద్యార్థులు బడికి రావడం లేదు. రెండో వారంలో 468 మంది, మూడో వారంలో 664 మంది హాజరయ్యారు. నాలుగో వారానికి వచ్చేసరికి 592 మంది వచ్చారు.

■ కామారెడ్డి పట్టణంతో పాటు మండలంలో 6,300 మంది విద్యార్థులు ఉండగా, మొదటి వారంలో 2,308 మంది మాత్రమే బడికి వచ్చారు. రెండో వారంలో 47 శాతం, మూడో వారంలో 58 శాతం హాజరు నమోదైంది. నాలుగో వారంలో 2,825 మంది అంటే 45 శాతం మంది హాజరయ్యారు.

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : జిల్లాను జ్వరాలు చుట్టుముట్టడంతో స్కూళ్లలో హాజరు శాతం తక్కువగా ఉంటోంది. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఇటీవల విద్యార్థులు చాలా మంది జ్వరాలతో బడికి రావడం లేదని ఉపాధ్యాయులు చెబుతున్నారు. కొన్ని ప్రాంతాల్లోనైతే సగం మంది కూడా స్కూళ్లకు హాజరు కావడం లేదు. జిల్లా అంతటా జ్వరాలు జనజీవనాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. చిన్నా పెద్దా తేడా లేకుండా వేలాది మంది జ్వరాల బారిన పడ్డారు. ముఖ్యంగా వైరల్ ఫీవర్స్, టైఫాయిడ్‌తో పాటు డెంగీ విజృంభించాయి. దీంతో జనం ఆస్పత్రుల చుట్టూ తిరగాల్సి వస్తోంది. ప్రధానంగా విద్యార్థులు చాలా మంది జ్వరాలతో ఇబ్బంది పడుతున్నారు. దీంతో స్కూళ్లకు వెళ్లలేకపోతున్నారు. కొందరు తల్లిదండ్రులు జ్వరాలు రాకున్నా, పిల్లలు ఇబ్బంది పడకూడదని స్కూళ్లకు పంపడం లేదు. దీంతో హాజరు 50 శాతం మించడం లేదు.

తల్లిదండ్రుల ఆందోళన

జిల్లాలో నెల రోజులుగా జ్వరాలు విజృంభిస్తున్నాయి. శరీర ఉష్ణోగ్రత పెరగడం, దగ్గు, జలుబు, ఒంటి నొప్పులతో పాటు కీళ్లనొప్పులు ఎక్కువ మందిని వెంటాడుతున్నాయి. డెంగీ, టైఫాయిడ్ జ్వరాలు కూడా ఎక్కువగానే నమోదవుతున్నాయి. డెంగీతో జిల్లాలో పలువురు ప్రాణాలు కోల్పోయారు. పిల్లలు జ్వరాల భారిన పడుతుండడంతో తల్లిదండ్రులు కలవరపడుతున్నారు. దీంతో పిల్లలను స్కూళ్లకు పంపించడం లేదు. ముఖ్యంగా ప్రాథమిక పాఠశాలల్లో చదివే విద్యార్థులు జ్వరాలతో మంచం పడుతున్నారు. గురుకులాలు, కస్తూర్బాలు, మోడల్ స్కూళ్లలోనూ జ్వరాల ప్రభావం ఉందని తెలుస్తోంది.

సదాశివనగర్ మండలం భూంపల్లిలో ఇద్దరు డెంగీ జ్వరాలతో చనిపోవడంతో ఆ ప్రాంతంలో జనంలో భయం వెన్నాడుతోంది. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది వెళ్లి అన్ని రకాల వైద్య సేవలు అందిస్తున్నారు. అయినప్పటికీ జ్వరాల తీవ్రత పెరిగితే ఇబ్బందులు ఎదురవుతాయని భయపడుతున్నారు. పిల్లల విషయంలో జాగ్రత్త పడుతున్నారు. భూంపల్లిలో చాలా మంది పిల్లలు స్కూళ్లకు వెళ్లడం లేదు.

అంగన్‌వాడీల్లోనూ..

మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే అంగన్‌వాడీ కేంద్రాల్లో సైతం చిన్నారుల హాజరు తక్కువగా ఉంటోంది. ఆగస్టులో 32 శాతం నుంచి 34 శాతం మంది మాత్రమే కేంద్రాలకు హాజరవుతున్నట్టు రికార్డులు చెబుతున్నాయి. చిన్నపిల్లలు చాలా మంది జ్వరాలబారిన పడుతున్న నేపథ్యంలో తల్లిదండ్రులు వారిని కేంద్రాలకు పంపడం లేదు. ఇంటి వద్దే జాగ్రత్తగా చూసుకుంటున్నారు. ఏది ఏమైనా నెల రోజులుగా జిల్లాను వణికిస్తున్న జ్వరాలు చదువులపై ప్రభావం చూపుతున్నాయనే చెప్పాలి.

ఆగస్టులో పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం వివరాలు

74,361	38,459	38,488	44,381	38,950
జిల్లాలో మొత్తం విద్యార్థులు	మొదటి వారంలో హాజరు (51.7 శాతం)	రెండో వారంలో (51.7 శాతం)	మూడో వారంలో (59.6 శాతం)	నాలుగో వారంలో (52.3 శాతం)

ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి



వీసీలో పాల్గొన్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం : రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల కోసం, పోలింగ్ స్టేషన్, పోలింగ్ సిబ్బంది ఎంపిక, తుది ఓటరు జాబితా తయారీ ప్రక్రియ పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ పార్థసారథి అధికారులను ఆదేశించారు. గురువారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రాబోయే 4, 5 నెలల్లో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. రాష్ట్రంలోని 12,769 గ్రామ పంచాయతీల్లో 1,14,834 వార్డులకు ఎన్నికలు నిర్వహించడానికి ఓటరు జాబితా సవరణ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. అధికారులు అప్రమత్తంగా ఉంటూ పకడ్బందీగా పని చేయాలన్నారు. ఓటరు జాబితా సవరణ పూర్తి కాగానే జీపీలలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో విడుదల చేయాలన్నారు. అభ్యంతరాలను స్వీకరించి పరిష్కరించాలని సూచించారు. ప్రతి కలెక్టరేట్‌లో ఎన్నికల సెల్ ఏర్పాటు చెయ్యాలని ఆదేశించారు. వీసీలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డీపీవో శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా క్రీడా దినోత్సవం



షటిల్ ఆడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం : హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవాన్ని గురువారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. క్రీడాశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉద్యోగులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఖేలో ఇండియా బ్యాడ్మింటన్ అకాడమీలో ఏర్పాటు చేసిన పోటీలను కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ప్రారంభించారు. క్రీడాకారులతో కలిసి షటిల్ ఆడారు. అనంతరం ఇందిరాగాంధీ స్టేడియంలో ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. 50, 100 మీటర్ల పరుగు పందెం, షార్ట్‌పుట్, టగ్ ఆఫ్ వార్, ఖోఖో, చెస్, మ్యూజికల్ చెయిర్, టేబుల్ టెన్నిస్ తదితర అంశాల్లో ఉద్యోగులకు పోటీలు నిర్వహించారు. ఉద్యోగులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడల అధికారి జగన్నాథం, పీడీలు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



క్రీడాకారులతో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నాగిరెడ్డిపేట తహసీల్దార్ సస్పెన్షన్



తహసీల్దార్ లక్ష్మణ్

నాగిరెడ్డిపేట : నాగిరెడ్డిపేట తహసీల్దార్ లక్ష్మణ్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. తహసీల్దార్ లక్ష్మణ్ మధ్యవర్తుల ద్వారా డబ్బులు వసూలు చేస్తూ అవినీతికి పాల్పడుతున్నారని వివిధ గ్రామాలకు చెందిన రైతులు ఈ నెల 23న తహసీల్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై పలు పత్రికలలో కథనాలు ప్రచురితమయ్యాయి. దీంతో తహసీల్దార్‌పై వచ్చిన ఆరోపణలపై విచారణ చేపట్టాలని ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్‌ను కలెక్టర్ ఆదేశించారు. ఈ మేరకు ఈ నెల 24న ఆర్డీవో నాగిరెడ్డిపేట తహసీల్ కార్యాలయానికి చేరుకొని విచారించారు. ఆ నివేదికను కలెక్టర్‌కు సమర్పించారు. ఈ క్రమంలో తహసీల్దార్ లక్ష్మణ్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

భూంపల్లి పంచాయతీ కార్యదర్శి..

సదాశివనగర్ : మండలంలోని భూంపల్లి పంచాయతీ కార్యదర్శి నరేంద్రకుమార్‌ను సస్పెండ్ చేసినట్లు ఎంపీడీవో సంతోష్‌కుమార్ గురువారం తెలిపారు. గ్రామంలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా ఉండడంతోనే గ్రామంలో విష జ్వరాలు వ్యాప్తి చెందాయని వైద్య ఆరోగ్య శాఖ ఇచ్చిన నివేదిక ఆధారంగా సస్పెండ్ చేసినట్లు పేర్కొన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు లింగంపల్లి పంచాయతీ కార్యదర్శి ప్రకాశ్‌కు ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించామన్నారు.

‘భగీరథ’ నీళ్లు బంద్

- పైప్‌లైన్ లీకేజీతో మూడు రోజుల పాటు నిలిపివేత



సింగూరులోని మిషన్ భగీరథ వాటర్ గ్రిడ్

నిజాంసాగర్ : సంగారెడ్డి జిల్లాలోని మిషన్ భగీరథ గ్రిడ్ వద్ద ప్రధాన పైపులైన్ల లీకేజీతో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు భగీరథ నీటి సరఫరా నిలిచిపోనుంది. ప్రధాన పైపులైన్ల మరమ్మతులతో నీటి సరఫరా బంద్ చేయనున్నారు. ఈ నేపథ్యంలో గ్రామ పంచాయతీల్లో బోరు మోటార్ల ద్వారా ట్యాంకులను నింపాలని మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లోని 799 గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. దీంతో గ్రామ పంచాయతీల్లో బోర్లు, సింగిల్ ఫేజ్ మోటార్ల ద్వారా నీటి సరఫరా చేయనున్నారు.

రుణమాఫీ కోసం రైతుల ధర్నా

కామారెడ్డి రూరల్ : ఎలాంటి షరతులు లేకుండా అర్హులైన రైతులకు రుణమాఫీ చేయాలని కోరుతూ గురువారం కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి గ్రామంలో రైతు వేదిక ఎదుట రైతులు రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. విషయం తెలుసుకున్న ఏవో పవన్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని రైతులను సముదాయించారు. ఏవో హామీ మేరకు రైతులు రాస్తారోకో విరమించారు. అనంతరం రైతులు ఏవోకు వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రైతులు బాయికాడి ఆనంద్‌రావు, లక్ష్మారెడ్డి, అమృత్‌రావు, పెట్టిగాడి నర్సింలు, రాజు తదితరులు పాల్గొన్నారు.



చిన్నమల్లారెడ్డి రైతు వేదిక వద్ద ధర్నా చేస్తున్న రైతులు

పారిశుద్ధ్యం.. అధ్వానం!

పట్టణంలో ఎక్కడి చెత్త అక్కడే..

- ఓపెన్‌ప్లాట్లలో పెరిగిన పిచ్చిమొక్కలు
- విజృంభిస్తున్న దోమలు
- రోగాల బారిన పడుతున్న ప్రజలు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు



వివేకానంద కాలనీలో పేరుకుపోయిన చెత్త

కామారెడ్డి టౌన్ : కామారెడ్డి పట్టణంలో పారిశుధ్యం అధ్వానంగా మారింది. కాలనీల్లో ఎక్కడ చూసినా చెత్తకుప్పలు పేరుకుపోయాయి. డ్రెయినేజీలు శుభ్రం చేయకపోవడంతో మురుగు నిలిచి దుర్గంధం వాపిస్తోంది. ఓపెన్ స్థలాల్లో పిచ్చి మొక్కలు పెరిగి, నీరు నిలిచి దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. దీంతో పట్టణవాసులు రోగాల బారిన పడుతున్నారు. పట్టణంలోని ఆర్‌కే లాడ్జ్ రోడ్డులో ఉండే ఓ యువకుడి డెంగీ రావడంతో హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నాడు. రుక్మిణి కుంటకు చెందిన ఓ యువకుడు జ్వరంతో మృతి చెందాడు. ఇలా బల్దియా పరిధిలో ఎంతో మంది విష జ్వరాలతో ఇబ్బంది పడుతున్నారు.



బల్దియా కార్యాలయం పక్కన డ్రెయినేజీ దుస్థితి

చర్యలు కరువు

పట్టణ ప్రజలు విషజ్వరాల బారిన పడి ఆస్పత్రుల్లో లక్షలు వెచ్చిస్తున్నారు. వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నా మున్సిపల్ పాలకులు, అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రధానమైన ప్రాంతాల్లో మాత్రమే రోడ్లు, మురికి కాలువలు శుభ్రం చేస్తున్నారని శివారు కాలనీల్లో పట్టించుకోవడం వాపోతున్నారు. దోమల నివారణ కోసం ఫాగింగ్, మందు పిచికారి చేయడం లేదు. ఓపెన్ స్థలాలలో మురుగు నీరు, పిచ్చి మొక్కలు పెరిగి దోమలు వృద్ధి చెందుతున్నాయి. ఆ ప్లాట్ల యజమానులకు నోటీసులు ఇచ్చి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

సమన్వయ లోపం

పట్టణంలో వైద్య ఆరోగ్యశాఖ, మున్సిపల్ అధికారుల మధ్య సమన్వయం లోపం కనిపిస్తోంది. గతంలో ఒక్క డెంగీ కేసు నమోదు అయినా స్థానిక పాలకులు, అధికారులు ఇంటింటా సర్వే చేసేవారు. ప్రస్తుతం అలాంటి చర్యలు చేపట్టడం లేరు. డెంగీ కేసులు భారీగా నమోదు అవుతున్నా స్థానిక కౌన్సిలర్లు వైద్యశాఖకు సమచారం ఇవ్వడం లేదని ఆరోపణలు ఉన్నాయి. శివారు కాలనీలతో పాటు, విలీన గ్రామాలలో పరిస్థితులు మరింత దారుణంగా ఉన్నాయి.

చర్యలు చేపడుతాం



పట్టణంలో దోమల నివారణ కోసం ఫాగింగ్ చేస్తున్నాం. ఓపెన్ స్థలాల యజమానులు స్వచ్ఛందంగా శుభ్రం చేసుకోవాలి. అన్ని వార్డులో సానిటేషన్ పనులు చేయిస్తున్నాం. ఫిర్యాదులు వస్తే తక్షణమే స్పందిస్తాం. – సుజాత, మున్సిపల్ కమిషనర్, కామారెడ్డి



టీచర్స్‌కాలనీలోని ఓపెన్ ప్లాట్‌లో పిచ్చిమొక్కలు

కాలానుగుణంగా ‘ఓపెన్’ కోర్సులు



కామారెడ్డి అర్బన్ : మారుతున్న కాలనుగుణంగా కొత్త కోర్సులు ప్రవేశ పెట్టి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్శిటీ విద్యాభివృద్ధి కోసం కృషి చేస్తుందని యూనివర్శిటీ డైరెక్టర్ ఆనంద్‌పవార్ అన్నారు. గురువారం ఆయన కామారెడ్డి ఓపెన్ యూనివర్సిటీ అధ్యాయన కేంద్రాన్ని సందర్శించారు. సబ్జెక్ట్ కౌన్సిలర్లతో సమావేశం నిర్వహించారు. విద్యార్థుల సంఖ్యను పెంచడానికి చర్యలు చేపట్టాలని సూచించారు. ఉత్తమ ఫలితాలు వచ్చే విధంగా తరగతులు నిర్వహించాలని పలు సూచనలు చేశారు. సమావేశంలో కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె కిష్టయ్య, అధ్యాయన కేంద్రం సమన్వయకర్త ఆకుల సుధాకర్, కార్యాలయ ఇన్‌చార్జి ఎల్ బాపురావు పాల్గొన్నారు.

పెన్షన్ విద్రోహ దినంగా పాటించాలి

కామారెడ్డి టౌన్ : పెన్షన్ విద్రోహ దినంగా సెప్టెంబర్ 1వ తేదిని పాటించాలని, ఆ రోజు జిల్లాలో ఉద్యోగులు నిరసన కార్యక్రమాలు చేపట్టాలని తెలంగాణ ఎంప్లాయిస్ గెజిటెడ్ ఆఫీసర్స్, టీచర్స్, వర్కర్స్, పెన్షనర్స్ అసోసియేషన్(టీఈజీజేఏసీ) జిల్లా ప్రతినిధులు కోరారు. గురువారం జిల్లా కేంద్రంలోని పెన్షనర్స్ భవనంలో జేఏసీ సంఘాల సమావేశం నిర్వహించారు. ఉద్యోగుల పాలిట శాపంగా మారిన కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానానికి నిరసనగా సెప్టెంబర్ 1న స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన ఉంటుదని తెలిపారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అధిక సంఖ్యలో ఉద్యోగులు పాల్గొని ఈ నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు వెంకటరెడ్డి, టీజీవో ప్రధాన కార్యదర్శి సాయిరెడ్డి, వివిధ సంఘాల నాయకులు దామోదర్‌రెడ్డి, అనిల్ కుమార్, విఠల్‌రావు, కుంట ఎల్లారెడ్డి, సాయిలు, హన్మంత్‌రెడ్డి, బషీర్, ముజీబోద్దిన్, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల జేఏసీ ప్రతినిధులు

క్లుప్తంగా

అతిథి ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పెద్దకొడప్‌గల్(జుక్కల్) : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో మహిళా అభ్యర్థుల నుంచి అతిథి ఉపాధ్యాయ పోస్టుల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు గురువారం ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సునీత ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో రెండు టీజీటీ మ్యాథ్స్, ఒక్క టీటీజీటీ సోషల్, ఒక్కటి పీఈటీ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అభ్యర్థులు తగిన అర్హతతో కూడిన ధ్రువీకరణ పత్రాలతో పాటు డెమో ద్వారా ఎంపిక చేస్తామన్నారు. శుక్రవారం 11 గంటల సమయం నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు.

గోకులాష్టమి వేడుకల్లో విద్యార్థి కన్నుకు గాయాలు

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండలంలోని నందివాడలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గోకులాష్టమి సందర్భంగా జరిగిన వేడుకల్లో విద్యార్థి కన్నుకు గాయమైన సంఘటన గ్రామస్తుల ద్వారా ఆలస్యంగా తెలిసింది. ఈనెల 24వ తేదీన పాఠశాల ఆవరణలో గోకులాష్టమి సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉట్టికొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామానికి చెందిన పెంటయ్య–నాగలక్ష్మిల కుమారుడైన ఆరోతరగతి చదువుతున్న శరత్‌కు వేడుకల్లో భాగంగా ఎడమ కన్నుకు కర్ర తగలగా తీవ్ర గాయమైంది. చికిత్స నిమిత్రం హైదరాబాద్ ఎల్వీ ఆస్పత్రికి తరలించినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు.

టీచర్ కోసం విద్యార్థుల నిరీక్షణ

- రాఘువపల్లి తండా స్కూల్‌లో సమయానికి రాని ఉపాధ్యాయులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : ఆ పాఠశాలలో రెగ్యులర్ ఉపాధ్యాయుడు ఇటీవల బదిలీ కావడం అక్కడ చదువుకునే విద్యార్థుల పాలిట శాపంగా మారింది. డిప్యూటేషన్‌పై వచ్చే ఉపాధ్యాయులు సమయానికి విధులకు రాకపోవడంతో విద్యార్థులు పాఠశాల ఆరుబయట ఆడుకుంటూ టీచర్ల కోసం నిరీక్షిస్తున్నారు. నాగిరెడ్డిపేట మండలంలోని రాఘువపల్లితండా పాఠశాలలో విధులు నిర్వహించే ఉపాధ్యాయుడు సురేందర్ ఇటీవల బదిలీపై వెళ్లారు. అప్పటి నుంచి మండలంలోని గోలిలింగాల పాఠశాలకు చెందిన టీచర్ వినీల్‌ను రాఘువపల్లితండా పాఠశాలకు డిప్యూటేషన్ వేశారు. గురువారం వినీల్ సెలవుపెట్టడంతో ఆ పాఠశాలకు మరో టీచర్ పంపడం ఆలస్యం కాగా విద్యార్థులు పాఠశాల పరిసరాలను శుభ్రంచేస్తూ, ఆరుబయట ఆడుకుంటూ గడిపారు. ఉదయం 10గంటల తర్వాత మండలంలోని లింగంపల్లికలాన్ పాఠశాల నుంచి ఒక టీచర్‌ను పంపి తరగతులను కొనసాగించారు.



స్కూల్ పరిసరాలను శుభ్రం చేస్తున్న విద్యార్థులు

31న మున్నూరుకాపు ప్రతిభ పురస్కారాలు

కామారెడ్డి అర్బన్ : మున్నూరుకాపు ప్రతిభ పురస్కారాలకు దరఖాస్తు చేసిన విద్యార్థులకు ఈనెల 31న ఉదయం 10 గంటలకు హైదరాబాద్ కాచిగూడలోని మున్నూరుకాపు ట్రస్ట్ భవన్‌లో చెక్కులు అందజేస్తారని ము న్నూరుకాపు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం అంజయ్య, జి అంజయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : పదో తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన పేద విద్యార్థులకు గోర్తీశ్వర ట్రస్టు ఆధ్వర్యంలో గురువారం నగదు బహుమతులు అందించారు. మండలంలోని జెడ్పీ బాలికల పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గోర్తీశ్వర ట్రస్టు సభ్యులు ఒక్కో విద్యార్థికి 10 వేల చొప్పున నగదును అందించారు.

డ్రగ్స్ ఫ్రీ తెలంగాణ కోసం కృషి చేయాలి



కామారెడ్డి టౌన్ : డ్రగ్స్ ఫ్రీ తెలంగాణ కోసం యువత ప్రతిఒక్కరూ ముందుకు రావాలని విద్యార్థి సేనా రాష్ట్ర అధ్యక్షుడు టీ కే శివప్రసాద్ పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ సైన్స్ కళాశాలలో విద్యార్థి సేన ఆధ్వర్యంలో జరిగిన యంగ్ సైరన్, డ్రగ్స్ ఫ్రీ తెలంగాణకు మేం సైతం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సేన జిల్లా అధ్యక్షుడు కే వినయ్, కళాశాల ప్రిన్సిపాల్ కిష్టయ్య, లెక్చరర్లు రాజ్‌గంబీర్, సుధాకర్, చంద్రశేఖర్ తదితరులున్నారు.

రైతులు ఆందోళన చెందవద్దు



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : రుణమాఫీ జరగని రైతులు ఏమాత్రం ఆందోళన చెందవద్దని, అధికారులు వివరాలు సేకరిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్ పేర్కొన్నారు. నాగిరెడ్డిపేట కాంగ్రెస్ కార్యాలయంలో గురువారం మాట్లాడుతూ నాగిరెడ్డిపేట అచ్చాయపల్లి రోడ్డుకు రూ. 3 కోట్లు, జలాల్‌పూర్ నుంచి ఏర్రారం వరకు వెళ్లే రోడ్డుకు రూ. 2.05 కోట్లు, నర్సన్నపల్లి తండా నుంచి తాండూర్ హైస్కూల్ వరకు రోడ్డు ఏర్పాటుకు రూ. 55 లక్షల నిధులను ఎమ్మెల్యే మదన్‌మోహనరావు మంజూరు చేయించారన్నారు. గోపాల్‌పేట ఆర్టీసీ బస్టాండ్ మరమ్మత్తుల కోసం రూ.90లక్షలతో ప్రతిపాదనలు ఎమ్మెల్యే తయారు చేశారన్నారు.

సంక్షిప్తం

పెద్ద ఆరేపల్లిలో ఒకరికి డెంగీ



నిజాంసాగర్(జుక్కల్) : మండలంలోని పెద్ద ఆరేపల్లి గ్రామంలో ఒక మహిళ డెంగీ నిర్ధారణ కావడంతో గురువారం వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది అప్రమత్తమయ్యారు. బాధిత కుటుంబం ఇంటి చుట్టూ దోమల మందు పిచికారీ చేయించారు. జ్వరాలొస్తే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త సునీత, ఈశ్వర్, ఆశ వర్కర్లు రుక్మిణి, లక్ష్మీ, అంగన్‌వాడీ టీచర్ సుజాత తదితరులు ఉన్నారు.

29వ సారి రక్తదానం



సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండలంలోని ధర్మారావ్‌పేట్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న జీవశాస్త్ర ఉపాధ్యాయుడు కృష్ణాకర్ రావు గురువారం 29వ సారి రక్తదానం చేశారు. కామారెడ్డి పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో డెంగీతో బాధపడుతున్న నిఖిల్‌సాయి అనే యువకుడికి అత్యవసరంగా ఓ పాజిటివ్ ప్లేట్‌లెట్స్ అవసరం ఉండగా కృష్ణాకర్ రావు స్పందించి రక్తాన్ని దానం చేశారు.

అన్నాబావు సాతే అడుగుజాడల్లో నడవాలి



మద్నూర్(జుక్కల్) : అన్నాబావుసాతేను ఆదర్శంగా తీసుకుని యువత ముందుకు సాగాలని గ్రామస్తులు పేర్కొన్నారు. మండలంలోని లచ్చన్‌లో గురువారం అన్నాబావుసాతే జయంతిని గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

హాస్టల్ తనిఖీ



బిచ్కుంద(జుక్కల్) : మండల కేంద్రంలోని బీసీ, ఎస్సీ బాలుర, బాలికల హాస్టల్‌ను గురువారం మండల ప్రత్యేక అధికారి చందర్ నాయక్ సందర్శించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సరుకులు పరిశీలించి నాణ్యత కలిగిన సరుకులు వాడాలి, ప్రతిరోజు ఎప్పటికప్పుడు శుభ్రమైన కూరగాయాలు వాడాలన్నారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలన్నారు. సీజనల్ వ్యాధులుతో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎంపీడీవో గోపాల్, కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి మండలంలోని తిమ్మారెడ్డి గ్రామంలో గల ప్రాథమిక పాఠశాలను ఎంపీవో ప్రకాష్ గురువారం పరిశీలించారు. పాఠశాలలోని విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించారు. ఎండీఎం భోజనం మెనూ ప్రకారం అందించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తదితరులున్నారు.

బాలుకు పురస్కారం



కామారెడ్డి అర్బన్: మెగా రక్తదాన శిబిరాల ద్వారా తలసేమియా వ్యాధిగ్రస్తుల కోసం 3,500 యూనిట్ల రక్తం సేకరించడంలో చేసిన కృషికి కామారెడ్డి రక్తదాతల సమూహం వ్యవస్థాపకులు డాక్టర్ బాలు, తలసేమియా సికెల్ సెల్ రాష్ట్రస్థాయి పురస్కారానికి ఎంపికయ్యారు. బాలు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా సమన్వయకర్తగా, ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్‌గా కొనసాగుతున్నారు.

చలో విద్యుత్ సౌధ పోస్టర్ల ఆవిష్కరణ



బాన్సువాడ : వచ్చేనెల 4న చలో విద్యుత్ సౌధ మహాధర్నాకు సంబంధించిన వాల్ పోస్టర్లను గురువారం బాన్సువాడలో విద్యుత్ ఉద్యోగులు ఆవిష్కరించారు. తెలంగాణ విద్యుత్ బీసీ, ఓసీ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి సభ్యులు మాట్లాడుతూ వచ్చే నెల 4న హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ నిర్వహించే బీసీ, ఓసీ విద్యుత్ ఉద్యోగుల విద్యుత్ సౌధ మహాధర్నాను సక్సెస్ చేయాలని పిలుపు నిచ్చారు. విద్యుత్ సంస్థల్లో కండిషన్లతో కల్పిస్తున్న పదోన్నతులపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి బాధ్యులపై అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు.

ఎల్లారెడ్డిలో..

ఎల్లారెడ్డిరూరల్ (ఎల్లారెడ్డి) : వచ్చేనెల 4వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించే చలో విద్యుత్ సౌధ కార్యక్రమాన్ని సక్సెస్ చేయాలని విద్యుత్ శాఖ బీసీ, ఓసీ ఉద్యోగ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం డీఈ కార్యాలయం ఆవరణలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణగౌడ్, రమేష్‌గౌడ్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

అల్లూరమ్మ ఆలయంలో చోరీ

లింగంపేట(ఎల్లారెడ్డి): కేశాయిపేట సమీపంలోని అల్లూరమ్మ ఆలయంలో బుధవారం రాత్రి చోరీ జరిగినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. వివరాలు.. గుర్తు తెలియని వ్యక్తులు ఆలయం గేటు తాళం పగులగొట్టి లోపలికి ప్రవేశించి గర్భ గుడి తలుపు తాళం పగులగొట్టారు. దేవస్థానంలో ఏర్పాటు చేసిన హుండీ తాళం పగులగొట్టి అందులో ఉన్న డబ్బులను అపహరించారు. ఉదయం ఆలయానికి వెళ్లిన కమిటీ సభ్యులు చోరీ జరిగిన విషయం గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ప్రతి వారం హుండీ డబ్బులు లెక్కించేవారు. ఈ సారి రెండు వారాలుగా హుండీని తెరవకపోవడంతో నగదు ఎక్కువగానే చోరీకి గురైనట్లు వారు పేర్కొన్నారు.

మహిళ అదృశ్యం

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): సోమర్యాగడి తండాకు చెందిన మంజుల(35) అనే మహిళ అదృశ్యమైనట్లు ఎస్సై మహేష్ గురువారం తెలిపారు. మంజుల వారం రోజుల క్రితం రాఖీ పండుగకు తల్లిగారింటికి వెళ్తానని ఇంట్లో చెప్పి వెళ్లిందని.. అప్పటి నుంచి ఆమె ఆచూకీ లభించడం లేదని ఆయన పేర్కొన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

అద్దె కారులో మేకల అపహరణ

ఖలీల్‌వాడి: నలుగురు యువకులు కారును అద్దెకు తీసుకొని మేకలను దొంగతనం చేసినట్లు ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు గురువారం తెలిపారు. వివరాలు..బుధవారం రాత్రి మిర్చికంపౌండ్‌లోని మేకల కొట్టం వద్దకు కారులో వచ్చిన నలుగురు యువకులు మేకలను కారులో ఎత్తుకెళ్లారు. గురువారం మేకల యాజమాని కొట్టాల వద్దకు వచ్చి చూసే సరికి మేకలు లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు అక్కడి సీసీ టీవీలను పరిశీలించి కారు వివరాలను కనిపెట్టారు. కారును ఒకటో టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. కారును అద్దెకు ఇచ్చానని పోలీసులకు కారు యాజమాని చెప్పారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఒకటో టౌన్ పోలీసులు తెలిపారు.


నిందితులను శిక్షించాలి



కామారెడ్డి టౌన్ : వ్యాపారి పాత విశ్వనాథంపై దాడి చేసి మృతికి కారణమైన నిందితులను కఠినంగా శిక్షించాలని ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో గురువారం జిల్లా ఎస్పీ సింధుశర్మకు ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు కంచర్ల లింగం, ప్రధాన కార్యదర్శి సుకుమార్‌గౌడ్, కోశాధికారి నర్సింలు తదితరులున్నారు. వ్యాపారి విశ్వనాథంపై దాడిచేసి మృతికి కారణమైన నిందితులకు కఠినంగా శిక్షించాలని డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్ రావు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

కామారెడ్డి అర్బన్ : వ్యాపారి విశ్వనాథం మృతికి సంతాపంగా గురువారం కామారెడ్డి పట్టణంలోని బంగారం దుకాణాలు బంద్ పాటించాయి. సువర్ణ, రజిత, ఆభరణ వర్తక సంఘం బంద్‌కు పిలుపునిచ్చింది.

నిజాయితీ చాటిన 108 సిబ్బంది



కామారెడ్డి క్రైం : లింగంపేట మండలం ఎల్లమ్మతండా వద్ద గురువారం సాయంత్రం బైక్‌ను కారు ఢీకొన్న ఘటనలో గాంధారి మండలం పేట్‌సంగెం గ్రామానికి చెందిన కూచి కాంతం తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం రావడంతో అక్కడికి చేరుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది క్షతగాత్రుడిని కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఘటన స్థలంలో కాంతంకు చెందిన రూ.50 వేలు కిందపడిపోయాయి. వాటిని భద్రపరిచిన పైలట్ వెంకటేష్, ఈఎంటీ కృష్ణలు పోలీసులకు అప్పగించి నిజాయితీని చాటుకున్నారు. గాయపడిన కాంతం చికిత్స పొందుతున్నాడు. కానిస్టేబుల్ లక్ష్మణ్ నగదును కాంతం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

మధురకు 'మైగ్రేషన్' విద్యార్థులు



నిజాంసాగర్(జుక్కల్) : జవహర్ నవోదయ నిజాంసాగర్ విద్యాలయంలో 9వ తరగతిలో చదువుతున్న ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని మధుర నియోజకవర్గానికి చెందిన విద్యార్థులను తిరిగి వారి స్వస్థలాలకు పంపించేశారు. కేంద్రీయ విద్యాలయ సమితి ఆధ్వర్యంలో కొనసాగుతున్న జవహర్ నవోదయ విద్యాలయాలకు ఇతర రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు మైగ్రేషన్ పద్ధతిన విద్యాభ్యాసానికి వస్తారు. అలాగే మధుర నుంచి కూడా 22 మంది విద్యార్థులు వచ్చారు. కాని వారి ప్రవర్తన సక్రమంగా లేకపోవడంతో స్థానికంగా ఉన్న విద్యార్థులతో ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ప్రహరీలపై రాతలు రాయడం, వెకిలి చేష్టలు చేస్తుండడంతో గతంలో ఎస్సై సుధాకర్ కౌన్సెలింగ్ ఇచ్చినప్పటికీ వారి తీరులో మార్పు రాలేదు. ఉపాధ్యాయులు, ప్రిన్సిపల్ ఎంత మందలించినా వారి తీరులో మార్పు రాకపోవడంతో మధురకు చెందిన ఏడుగురు విద్యార్థులను తిరిగి వారి స్వస్థలానికి మూడురోజుల క్రితం అధికారులు పంపించేశారు.

మద్యం తాగించి హత్యకు ప్రయత్నం

- నస్రుల్లాబాద్ అటవీ ప్రాంతంలో ఘటన
- తీవ్ర గాయాలై రోడ్డుపై పడి ఉన్న యువకుడ్ని 108లో ఆస్పత్రికి పంపిన స్థానికులు
- బాన్సువాడ పట్టణ పోలీసులకు ఫిర్యాదు



వాహనదారులకు గోడు చెబుతున్న బాధితుడు

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మద్యం తాగించి యువకుడిని చంపేందుకు ప్రయత్నించిన ఘటన నస్రుల్లాబాద్ అటవీ ప్రాంతంలో చోటుచేసుకుంది. బాధితుడు(బాన్సువాడ మండలం కొల్లూర్ గ్రామస్తుడు) చింబెల్లి ఆంజనేయులు తెలిపిన వివరాలు.. అంజనేయులు బాన్సువాడ పట్టణ ప్రాంతానికి దగ్గరలో పంట పొలం వద్ద ఉండగా కొల్లూర్ గ్రామానికి చెందిన బర్ల ప్రవీణ్.. వరిన్‌లో మేస్త్రీ వద్ద డబ్బులు రావాల్సి ఉన్నాయని వెళ్లి వద్దామని ఫోన్ చేశాడు. దీంతో ఆంజనేయులు తన బైక్‌పై నస్రుల్లాబాద్ వరకు ఒంటరిగా వచ్చాడు. అప్పటికే ప్రవీణ్‌తో పాటు మరొకరు బైక్‌పై నస్రుల్లాబాద్‌లో సిద్ధంగా ఉన్నారు. మా బండికి పేపర్లు లేవని.. నీ బండిపై వెళ్దామని ఆంజనేయులుకు ప్రవీణ్ చెప్పాడు. మార్గమధ్యంలో మద్యం సేవించి వెళ్దామని ఆంజనేయులుకు ఇద్దరూ చెప్పి బీర్లు తెచ్చుకున్నారు. నస్రుల్లాబాద్ అటవీ ప్రాంతంలో ముగ్గురూ కలిసి తాగారు. ఒక బీరు తాగిన తర్వాత ఆంజనేయులు తాను ఇంటికి వెళ్తానని మిగతా ఇద్దరికీ చెప్పడంతో.. ఎక్కడికి వెళ్తావ్ అంటూ విచక్షణారహితంగా కొట్టి నోట్లో ఏదో పసరు పోశారు..అనంతరం బ్లేడ్‌తో కోశారు. భయబ్రాంతులకు గురైన ఆంజనేయులు వారి నుంచి తప్పించుకుని బాన్సువాడ –వర్ని ప్రధాన రహదారిపైకి వచ్చాడు. స్థానికుల సహాయంతో 108 వాహనంలో బాన్సువాడ ఆస్పత్రిలో చేరాడు. ఈ విషయం గురించి బాధితుడు ఫిర్యాదు చేయడంతో బాన్సువాడ పట్టణ పోలీసులు విచారణ చేపట్టారు.

అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంప్ సీజ్



రుద్రూర్: కోటగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాతంగల్ శివారులో వీరభద్ర మందిరం వద్ద అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంప్‌ను గురువారం సాయంత్రం సీజ్ చేసినట్లు తహసీల్దార్ మల్లయ్య తెలిపారు. డంప్‌లోని ఇసుక సుమారు 15 ట్రాక్టర్లు ఉంటుందని తెలిపారు. ఇసుకను అక్రమంగా డంప్ చేస్తే విచారణ చేసి వాహనాన్ని సీజ్ చేయడంతో పాటు బాధ్యులపై కేసు నమోదు చేస్తామని తహసీల్దార్ హెచ్చరించారు.

ఆస్తి కోసం తన్నుకున్నారు

- ఇటుకలు, కర్రలతో పరస్పర దాడులు చేసుకున్న అన్నదమ్ముల కుటుంబాలు
- ఈ ఘటనలో ఆరుగురికి గాయాలు
- ఇద్దరి పరిస్థితి విషమం



గాయాలపాలైన నాగమణి, బాన్సువాడలో చికిత్స పొందుతున్న శంకర్ కుటుంబ సభ్యులు

బాన్సువాడ: ఆస్తి కోసం అన్నదమ్ముల కుటుంబాలు ఘర్షణ పడటంతో ఆరుగురికి గాయాలయ్యాయి.. అందులో ఇరువురి పరిస్థితి విషమంగా మారింది. ఈ ఘటన బీర్కూర్ మండల కేంద్రంలో బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. వివరాలు.. బీర్కూర్‌కు చెందిన మంగలి శంకర్, మంగలి మాధవ్ ఇద్దరు అన్నదమ్ములు. కొన్నేళ్లుగా ఇరువురు వేర్వేరుగా ఉంటూ జీవనం సాగిస్తున్నారు. పది రోజుల క్రితం వీరి తల్లి నర్సవ్వ చనిపోయింది. తల్లి చావు ఖర్చులు, ఆస్తి విషయంలో శంకర్, మాధవ్‌ల మధ్య ఘర్షణ మొదలైంది. ఇరుకుటుంబ సభ్యులు పరస్పర దాడులకు పాల్పడడంతో శంకర్ కుమారుడైన బాబులాల్ తన చిన్ననాన్న మాధవ్‌ను నెట్టడడంతో కింద పడ్డాడు. ఆ తర్వాత ఇరు కుటుంబ సభ్యులందరూ ఒకరిపై ఒకరు దాడులకు దిగారు. ఈ దాడుల్లో మాధవ్‌కు, ఆయన భార్య నాగమణికి తలలు పగిలి తీవ్ర గాయాలయ్యాయి. నాగమణి అపస్మారక స్థితికి చేరుకుంది. ఈ దాడిని చూసి మాధవ్ కుమారుడు రామ్ భయంతో అక్కడి నుంచి పారిపోయాడు.

గమనించిన స్థానికులు మాధవ్‌ను, నాగమణిని బాన్సువాడ ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో వైద్యుల సలహా మేరకు నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు. మాధవ్, నాగమణిల పరిస్థితి విషమంగా ఉందని తెలిసింది. స్వల్ప గాయాలైన శంకర్, ఆయన కుమారుడు బాబులాల్, కుమార్తె, కోడలు బాన్సువాడ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి విచారణ చేపట్టారు.

ఘన్‌పూర్‌లో దారుణహత్య



బట్టు కృష్ణ(ఫైల్)



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై, సీఐలు

నిజామాబాద్ రూరల్: డిచ్‌పల్లి మండలం ఘన్‌పూర్‌లో బుధవారం రాత్రి బట్టు కృష్ణ (25) అనే వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. కల్లు కంపౌండ్ ముందు ఉన్న హెచ్‌ఏ చికెన్ సెంటర్ వద్ద కృష్ణ మృతి చెంది ఉండగా స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి హుటాహుటిన చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వీపులో పదునైన ఆయుధంతో పొడిచినట్లుగా.. మూడు గాయాలు ఉన్నట్లుగా గుర్తించారు. ఘటనా స్థలంలో డాగ్‌స్క్వాడ్‌తో విచారణ చేపట్టారు. కృష్ణ భార్య కొన్ని సంవత్సరాల కిందట వదిలివెళ్లిపోయింది. ప్రస్తుతం ముగ్గురు పిల్లలు అనాథలుగా మారారు. వ్యక్తిగత కక్షలతో హత్య జరిగి ఉండవచ్చని, మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మల్లేష్, ఎస్సై మహమ్మద్ షరీఫ్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి



రాజశేఖర్ (ఫైల్)

కామారెడ్డి క్రైం: రోడ్డు దాటుతున్న వారిని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి గ్రామానికి చెందిన నెల్లూరి రాజశేఖర్ (28) మృతిచెందారు. రాజు అనే మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన జిల్లా కేంద్రానికి సమీపంలోని క్యాసంపల్లి వద్ద జాతీయ రహదారిపై గురువారం సాయంత్రం జరిగింది. దేవునిపల్లి పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి విచారణ జరిపారు. రాజును ఆస్పత్రికి తరలించారు.

గుర్తు తెలియని వృద్ధుడు..

బోధన్: ఎడపల్లి మండలంలోని జాన్కంపేటలో గురువారం గుర్తు తెలియని వృద్ధుడు(70) మృతి చెందినట్లు ఎస్సై వంశీచందర్ రెడ్డి తెలిపారు. గ్రామంలో రోడ్డు ప్రక్కన పడి ఉండటంతో స్థానికులు, పోలీసులకు సమాచారం చేరవేశారు. పోలీసులు వెళ్లి పరిశీలించి వృద్ధుడు మృతి చెందినట్లుగా గుర్తించారు. మృతదేహాన్ని బోధన్ జిల్లా ప్రభుత్వాస్పత్రి మార్చురీ గదికి తరలించారు. మృతుడి బంధువులెవరైనా గుర్తు పట్టినట్లయితే 87126 59873, 87126 59780 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి..

రామారెడ్డి: ఎల్లంపేట గ్రామానికి చెందిన భూక్య శంకర్(35) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తాడు. శంకర్ భార్య రెండు రోజుల క్రితం గొడవపడి తల్లి గారి ఇల్లు అన్నారం గ్రామానికి వచ్చింది. శంకర్ తన భార్య కోసం బుధవారం అన్నారం గ్రామానికి వెళ్లాడు. గురువారం అన్నారం గ్రామ శివారులోని కల్వర్టు వద్ద మృతదేహాన్ని గుర్తించారు. మృతుడి అన్న భూక్య రవి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు.

డయల్ 100 దుర్వినియోగం.. వ్యక్తికి జైలు శిక్ష



ఖలీల్‌వాడి: మద్యం సేవించి డయల్ 100ను మిస్ యూజ్(దుర్వినియోగం) చేసిన కావేటి నారాయణకు మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు నాలుగో టౌన్ పోలీస్‌స్టేషన్ ఎస్సై శ్రీకాంత్ గురువారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు.. నగరంలోని పద్మానగర్ కాలనీకి చెందిన కావేటి నారాయణ తరుచూ మద్యం సేవించి కాలనీవాసులతో పాటు ఇతరులతో గొడవలకు దిగుతున్నట్లు చెప్పారు. మద్యం సేవించిన తర్వాత డయల్ 100కు ఫోన్ చేసి పోలీసులను ఇబ్బందులకు గురి చేయడంతో కేసు నమోదు చేసి రెండో మేజిస్ట్రేట్ వద్ద హాజరుపర్చగా మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు చెప్పారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు

బిచ్కుంద(జుక్కల్): మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేశామని ఎస్సై మోహన్‌రెడ్డి తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని అంబేడ్కర్, గోపన్‌పల్లి చౌరస్తాలలో వాహనాలు తనిఖీ చేశారు. ఈ నెలలో 42 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు.

దురుసుగా ప్రవర్తించిన ఇద్దరికి రిమాండ్

వేల్పూర్: వెంకటాపూర్‌లో బుధవారం అర్ధరాత్రి పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులపై దురుసుగా ప్రవర్తించిన ఆరేపల్లి అరవింద్, గైనిమీది జనార్దన్ యాదవ్‌లను గురువారం రిమాండ్‌కు పంపినట్లు స్థానిక ఎస్సై నాగ్‌నాథ్ తెలిపారు. వివరాలు.. పోలీస్ పెట్రోలింగ్ పార్టీ వెంకటాపూర్ గ్రామం చేరుకునే సరికి కుకునూర్ గ్రామానికి చెందిన అరవింద్, వేల్పూర్‌కు చెందిన జనార్దన్, మరికొందరు వెంకటాపూర్‌లోని అరవింద్‌కు చెందిన డీజే షాపువద్ద గుమిగూడి ఉండగా పోలీసులు మందలించారు. ఆవేశంలో అరవింద్, జనార్దన్ ఇద్దరూ పోలీసులతో దురుసుగా ప్రవర్తించి విధులకు ఆటంకం కలిగించారు. దాంతో పెట్రోలింగ్ పోలీసుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి వారిని రిమాండుకు తరలించారు.

డీజే నిర్వాహకుల బైండోవర్



లింగంపేట(ఎల్లారెడ్డి): శెట్పల్లిసంగారెడ్డి, కోమట్‌పల్లి, సజ్జన్‌పల్లి, గ్రామాలకు చెందిన నలుగురు డీజే నిర్వాహకులను గురువారం బైండోవర్ చేసినట్లు ఎస్సై అరుణ్‌కుమార్ తెలిపారు. గణేష్ ఉత్సవాల్లో డీజేలు ఏర్పాటు చేయవద్దని ముందస్తుగా బైండోవర్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. గణేష్ ఉత్సవాలు శాంతియుతంగా జరుపుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ఎల్లారెడ్డి సీఐ రవీందర్‌నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

గుట్కా పట్టివేత

- నలుగురిపై కేసు నమోదు

ఖలీల్‌వాడి: నగరంలోని రెండో పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం రాత్రి కారులో తరలిస్తున్న గుట్కాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై యాసిన్ అరాఫత్ గురువారం తెలిపారు. కారులో 20 గుట్కా బ్యాగులు, నాందేడ్‌కు చెందిన అంకుష్ జాదలవార్, శివాజీ గైక్వాడ్ ఉన్నట్లు చెప్పారు.నగరంలో గుట్కాను తక్కువ ధరకు కొని నాందేడ్‌లో ఎక్కువ ధరకి అమ్మి లాభం గడించాలని ఉద్దేశంతో ఈ వ్యాపారం చేస్తున్నామని నిందితులు తెలిపారు. వీటి విలువ రూ. రూ.1.24లక్షలు ఉంటుదని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

నిజామాబాద్ రూరల్: ఆకుల కొండూర్ శివారులో గురువారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు రూరల్ ఎస్‌హెచ్‌వో ఆరిఫ్ తెలిపారు. వివరాలు.. ఆకుల కొండూర్ గ్రామానికి చెందిన ప్రవీణ్ గురువారం ఉదయం తన వ్యవసాయ క్షేత్రంలోని బోరుమోటర్ వద్దకు వెళ్లగా అక్కడ కుళ్లిపోయిన స్థితిలో శవం కనిపించింది. వెంటనే ఈ విషయాన్ని ఆయన పోలీసులకు చేరవేశారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. మృతదేహం పురుషుడిగా గుర్తించామని, చనిపోయిన వ్యక్తికి 45 ఏళ్లు ఉంటాయని, వారం క్రితం చనిపోయి ఉండవచ్చని ఎస్‌హెచ్‌వో వివరించారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.